ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 47 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 21 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## రాహుల్ గాంధీపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదు..!

**అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకుగాను కర్ణాటక భాజపా నేతలు ఆయనపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.**



బెంగళూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్గాంధీ ఇటీవల అమెరికా పర్యటనలో ఒక వర్గానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటకలోని భాజపా నేతలు రాహుల్ గాంధీపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బెంగళూరులోని హై గ్రౌండ్ పోలీస్ స్టేషన్లో ఎఫ్ఎఆర్ నమోదైంది. 6 కొన్ని వర్గాలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలతో పాటు రిజర్వేష్లను తొలగిస్తామంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేసినందుకు రాహుల్ గాంధీపై ఎఫ్ఎఆర్ నమోదైంది. ప్రతిపక్ష నాయకుడు విభజన వ్యాఖ్యలు పలువురిని ఆందోళన కలిగించాయి' అని భాజపా ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా ఎక్స్లో పోస్ట్ చేశారు. భాజపా అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు తొలిగించే కుట్రలో రాహుల్ విజయం సాధించలేరని విమర్శించారు. ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్ డీసీ శివార్లలోని హెండన్లో జరిగిన కార్యక్రమంలో రాహుల్ భారతీయ అమెరికన్లను ఉద్దేశించి మాట్లాడారు. కొన్ని అంశాలపై భారత్లో ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. అన్ని మతాలకూ ఇదే పరిస్థితి తప్పడం లేదన్నారు. అదేవిధంగా భారత్లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాత రిజర్వేషన్లు రద్దుపై తమ పార్టీ ఆలోచిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా తప్పుపట్టింది.

## ఆ మూడు కుటుంబాలే జమ్మూకశ్మీర్లో హింసను ప్రేరేపించాయి :అమిత్ షా

**జమ్మూ కశ్మీర్లోని ఓ ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల పై నిప్పులు చెరిగారు.**



శ్రీనగర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: జమ్మూకశ్మీర్ లోని మెంథార్లో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. జమ్మూలో మూడు కుటుంబాల (గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం) హింసను ప్రేరేపించాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాబట్టి ఆ మూడు పార్టీల( కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ) వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా అనే మూడు కుటుంబాల పాలనను అంతం చేయబోతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. ఈ మూడు కుటుంబాలే ఎన్నోఏళ్లుగా జమ్మూలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే, జమ్మూకశ్మీర్లో ఎప్పటికీ పంచాయతీ లేదా బ్లాక్ స్థాయి ఎన్నికలు జరిగేవి కావని అన్నారు. "1990ల్లో ఇక్కడి సోదరులు ధైర్యసాహసాలతో బుల్లెట్లను ఎదుర్కొన్నారు. 1947 నుంచి పాకిస్థాన్తో జరుగుతున్న ప్రతీ యుద్ధంలో సైనికులు జమ్మూ సరిహద్దుల్లో ఉంటూ దేశాన్ని రక్షిస్తున్నారు" అని అమిత్ సైనికుల త్యాగాలను కీర్తించారు. కేంద్రప్రభుత్వం ఇప్పుడు కశ్మీర్ యువత చేతుల నుంచి తుపాకులు, రాళ్లను తీసేసి, పెన్నులు, ల్యాప్టాప్లు పట్టుకునేలా చేస్తోందని ప్రశంసించారు. త్వరలో ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలిస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం సరిహద్దుల్లో మరిన్ని బంకర్లను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. "గతంలో ఇక్కడి పాలకులు పాకిస్థాన్ను చూసి భయపడేవారు. కానీ ఇప్పుడు మోదీని చూసి పాకిస్థాన్ భయపడుతోంది. భారత్ పైకి వస్తే ప్రధాని తగిన సమాధానం ఇస్తారని వారికి తెలుసు. అందుకే దేశ సరిహద్దుల్లో కాల్పులు తగ్గుముఖం పట్టాయి" అని షా అన్నారు. జమ్మూకశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. సెప్టెంబరు 18న తొలివిడత పోలింగ్ నిర్వహించగా.. రెండో దశ సెప్టెంబరు 25న, చివరిదశ అక్టోబర్ 1న జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలను అక్టోబర్ 8న వెల్లడిస్తారు. జమ్మూకశ్మీర్ లో ఇటీవల పర్యటించిన ప్రధాని మోదీ తొలివిడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదవడంపై హర్షం వ్యక్తంచేశారు. "ఇప్పుడు జమ్మూకశ్మీర్ యువత నిస్సహాయులు కారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఇప్పుడు కశ్మీర్ యువత రాళ్లను వదిలి పుస్తకాలు, పెన్నులు పట్టుకుంటున్నారు. వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అంతేకాదు. ఇక్కడి ప్రజలు ఎలాంటి భయం, బెరుకు లేకుండా తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. రెండో విడతలోనూ మరింత ఎక్కువమంది ఈ ప్రజాస్వామ్య పండుగలో పాల్గొని సరికొత్త రికార్డులు సృష్టించాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కిలారి రోశయ్య భేటీ

**ఇటీవల వైకాపాకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య జనసేన పార్టీలో చేరనున్నారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: ఇటీవల వైకాపాకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య జనసేన పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో అధినేత పవన్ కల్యాణ్ తో ఆయన భేటీ అయ్యారు. ఆదివారం ఆయన జనసేన పార్టీలో చేరనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆయనతోపాటు వియ్యంకుడు రవిశంకర్ కూడా జనసేన గూటికి చేరనున్నారు. 2019 ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన రోశయ్య.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు లోక్సభ స్థానానికి పోటీ చేసి పరాజయం పాలయ్యారు.

## ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం: మంత్రి లోకేశ్

**ఏపీ రాష్ట్రబివృద్ధికి భారత పరిశ్రమల సమాఖ్యతో కలిసి పనిచేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు.**



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: ఏపీ రాష్ట్రాభివృద్ధికి భారత పరిశ్రమల సమాఖ్యతో కలిసి పనిచేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై ఇప్పుడు ఏపీ దృష్టి పెట్టిందని చెప్పారు. వేగంగా అనుమతులు, యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని వెల్లడించారు. విజయవాడలో సీఐఐ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం. నెల రోజుల్లో ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తాం. పెట్టుబడుల కోసం మీ వద్దకే మేం వస్తాం. నైపుణ్యం ఉన్న మానవ వనరులు కూడా ఏపీలో సిద్ధం" అని లోకేశ్ అన్నారు.

### పరిశ్రమల ఏర్పాటుకు ఎకో సిస్టం

పరిశ్రమల ఏర్పాటుకు శాశ్వతంగా ఒక ఎకో సిస్టం ఉండాలని, అప్పుడే పెట్టుబడులు సుస్థిరంగా వచ్చే అవకాశం ఉంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. హైదరాబాద్ లోని జినోమ్ వ్యాలీ, ఐటీ కారిడార్లు గతంలో ఏర్పాటు అయ్యాయని, వాటికి రాజకీయాలు, ప్రభుత్వాలతో సంబంధం ఉండదని తెలిపారు. ఏపీలో ఏర్పాటైన కియా లాంటి పరిశ్రమలు కూడా అలాంటివేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంప్రదాయేతర విద్యుత్ పీపీఏలు రద్దు కావడం.. ఏపీకే కాదు యావత్ భారత దేశంపైనా ప్రభావం చూపిందని విమర్శించారు. పెట్టుబడులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసేందుకు తమ ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోందన్నారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఏపీలో అగ్రి బయోటెక్ క్లస్టర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర యెల్లా సూచించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేశ్ అనంతపురంలో దీని ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలను బయటపెడతాం: కేటీఆర్

**రాష్ట్ర ప్రభుత్వం చేసిన అక్రమాలన్నింటినీ బయట పెడతామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు అవినీతి చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. సీఎం తన అధికారాన్ని ఉపయోగించి బావమరిదికి పనులు అప్పగించారని ఆరోపించారు. హైదరాబాద్లో ఆయన మీడియాతో మాట్లాడారు. "సీఎం రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు అప్పగించారు. రూ.2 కోట్ల లాభం ఉన్న కంపెనీ రూ.1000 కోట్ల విలువైన పనులు చేస్తుందా? అమృత్ పథకంలో జరిగిన టెండర్ల వివరాలను ప్రభుత్వం బయటపెట్టడం లేదు. టెండర్లపై కేంద్రం విచారణ జరిపించాలి. ఇప్పటి వరకు జరిగిన అమృత్ పథకం టెండర్లను రద్దు చేయాలి. ఈ టెండర్ల అవినీతిపై కేంద్రానికి లేఖ రాశాం. ప్రభుత్వం చేసిన అక్రమాలన్నీ బయట పెడతాం" అని కేటీఆర్ అన్నారు.




## తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం :చంద్రబాబు

**తిరుమల పవిత్రతకు పూర్వవైభవం తీసుకొస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: తిరుమల పవిత్రతకు పూర్వవైభవం తీసుకొస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. తప్పు చేసిన వారు చరిత్ర హీనులుగా మిగిలిపోయేలా కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. మీడియాతో చిట్చాట్లో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. "తిరుమలకు 200 ఏళ్ల పైబడిన చరిత్ర ఉంది. ఇంట్లో స్వామి వారి లడ్డూ ఉంటే ఇళ్లంతా ఘుమఘులాడే వాసన వచ్చేది. అంతటి పవిత్రత, విశిష్టత ఉన్న లడ్డూను కల్తీ చేయడమే కాక జగన్ ఎదురుదాడి చేస్తారా? ప్రజలు గుణపాఠం చెప్పినా బుద్ధి మార్చుకోరా..? స్వామి వారి అన్న ప్రసాదం స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు పెట్టాం. తిరుమల శ్రీవారి విషయంలో నేను ఒకటికి పదిసార్లు ఆలోచిస్తా. స్వామివారి విషయంలో అపచారం తలపెట్టే మాటలు పొరపాటున కూడా చేయం. వాస్తవాలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయనే బాధ నాకూ ఉంది. అలాగని గత పాలకులు చేసిన దుర్మార్గాలు చూస్తూ ఊరుకోవాలా?" అని చంద్రబాబు ప్రశ్నించారు.

## శ్రీవారి లడ్డూ కల్తీపై తితిదే అత్యవసర సమావేశం

**శ్రీవారి లడ్డూ కల్తీపై తితిదే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. తిరుపతి పరిపాలన భవనంలో ఆగమ సలహాదారులు, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు.**



తిరుమల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: శ్రీవారి లడ్డూ కల్తీపై తితిదే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. తిరుపతి పరిపాలన భవనంలో ఆగమ సలహాదారులు, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. లడ్డూ అపవిత్రత నేపథ్యంలో సంప్రోక్షణపై సమావేశంలో చర్చిస్తున్నారు. ప్రధాన అర్చకుడు, ఆగమ పండితులతో తితిదే ఈవో శ్యామలరావు చర్చిస్తున్నారు. సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 28న హైదరాబాద్కు రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న హైదరాబాద్కు రానున్నారు. ఈ మేరకు పర్యటన ఖరారైనట్లు రాష్ట్రపతి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతి ముర్ము ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో 11.50 గంటలకు హకీంపేట్ ఎయిర్పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 12:20కి నల్సార్ యూనివర్సిటీలో జరిగే యూనివర్సిటీ 21వ కాన్వొకేషన్కు ముఖ్య అతిథిగా హాజ-రు కానున్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## గత ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రంతో పాటు దేశానికి చెడ్డపేరు: మంత్రి నారా లోకేశ్

**20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గత ఐదేళ్లుగా పరిశ్రమల రంగం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందని, తమ ప్రభుత్వం పరిశ్రమలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలకు మధ్య సంప్రదింపులకు ఫోరం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, వారం రోజుల్లోగా దీనికి సంబంధించి ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వాలు మారినా పాలన అలాగే ఉండాలని, పీపీఏలు రద్దు చేయటం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా నష్టపోయిందన్నారు. వైకాపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా దేశానికి చెడ్డపేరు వచ్చిందన్నారు. "పదే పదే ప్రభుత్వ నిర్ణయాలు మార్చేయకుండా ఓ చట్టం తీసుకురావాలని కేంద్రంతో మాట్లాడుతాం. త్వరలోనే ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు ద్వారా పరిశ్రమలకు ఆహ్వానం పలుకుతాం. గత ప్రభుత్వం మాదిరిగా రహస్య జీవోలు ఇవ్వటం లేదు. ప్రతి అంశాన్ని ప్రజలముందు ఉంచుతున్నాం. హౌస్ అరెస్టులు, గేట్లకు తాళ్లు కట్టే ప్రభుత్వం మాది కాదు. పరదాలు కట్టుకుని తిరిగే సీఎం కాదు చంద్రబాబు. లడ్డూ ప్రసాదంలో అపవిత్ర పదార్థాలు కలిపిన వ్యవహారంలో మా సవాలును వైకాపా నేతలు ఎందుకు స్వీకరించలేదు. 24 గంటల పాటు తిరుపతిలోనే ఉన్నా.. చర్చకు ఎందుకు రాలేకపోయారో వాళ్లే చెప్పాలి" అని లోకేశ్ అన్నారు.

## లడ్డూ వివాదం.. 3 రోజుల పాటు శ్రీవారి ఆలయంలో మహాశాంతియాగం

**శ్రీవారి లడ్డూ కల్తీ దుమారం కొనసాగుతోన్న వేళ అత్యవసరంగా సమావేశమైన తితిదే కీలక నిర్ణయం తీసుకుంది.**



తిరుమల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: శ్రీవారి లడ్డూ కల్తీ దుమారం కొనసాగుతోన్న వేళ తిరుమల పవిత్రతను కాపాడే అంశంపై అత్యవసరంగా సమావేశమైన తితిదే కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతిలోని తితిదే పరిపాలన భవనంలో ఆగమ సలహాదారులు, ఉన్నతాధికారులతో ఈవో శ్యామలరావు భేటీ అయ్యారు. లడ్డూ అపవిత్రమైన దృష్ట్యా ఆగమశాస్త్రపరంగా సూచనలివ్వాలని అధికారులు కోరారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీవారి ఆలయంలో మహాశాంతి యాగం నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. వేణుగోపాల దీక్షితులు, నలుగురు ఆగమ సలహాదారులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రస్తుతం రాష్ట్రంలో 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లు ఉంది :హరీశ్ రావు

**కొందరు పోలీసు అధికారులకు సంబంధించి అవినీతి ఆరోపణలపై వచ్చిన కథనాలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలి పడితే.. సీనియర్ పోలీస్ అధికారులు పడిన కష్టమంతా వృథా అవుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు పోలీసు అధికారులకు సంబంధించి అవినీతి ఆరోపణలపై వచ్చిన కథనాలపై ఎక్స్ వేదికగా స్పందించారు. యువ అఖిల భారత సర్వీస్ అధికారులకు ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండి, వాళ్లకి పని పట్ల నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని నేర్పించాలన్నారు. కానీ 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లు రాష్ట్రంలో పరిస్థితి తయారైందని వ్యాఖ్యానించారు. భారాస అధినేత కేసీఆర్ ఆలోచనలతో గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగాన్ని దేశంలోనే నంబర్ వన్గా తీర్చిదిద్దామని, ఆ ప్రక్రియలో ఎందరో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ పోలీస్ అధికారుల పాత్ర కచ్చితంగా ఉందన్నారు. అలాంటి తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలి పడితే పోలీస్ అధికారులు పడ్డ కష్టమంతా వృథా అవుతుందన్నారు. ఒక్కసారి ఈ విషయాన్ని తెలంగాణ సీనియర్ పోలీస్ అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి సూచించారు.

## సింహాచలం ఆలయంలో నెయ్యి రుచి చూసి పెదవి విరిచిన గంటా శ్రీనివాసరావు

**సింహాచలం ఆలయంలో ముడిసరుకుల నాణ్యతను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు.**



విశాఖ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: సింహాచలం ఆలయంలో ముడిసరుకుల నాణ్యతను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. నెయ్యి రుచి చూసి ఆయన పెదవి విరిచారు. ప్రసాదం లడ్డూలోనూ నెయ్యి వాసన లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సింహాచలం ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం గంటా మాట్లాడారు. "నెయ్యి కిలో రూ.341కే సరఫరా చేస్తున్నారంటే నాణ్యత పరిశీలించారా..? నేను చాలా ఆదా చేస్తున్నాను అన్న పేరు తెచ్చుకోవాలని జగన్మోహన్ రెడ్డి రివర్స్ టెండరింగ్ వల్ల వచ్చిన అనర్థాలు ఇవి" అని గంటా మండిపడ్డారు. "భక్తుల మనోభావాలతో ఆడుకున్న జగన్మోహన్ రెడ్డికి ఏం శిక్ష విధించాలో జనం, భక్తులు నిర్ణయించాలి. వైకాపా నేతలు తిరిగి ఇప్పటి ప్రభుత్వం మీద ఎదురు దాడి చేస్తున్నారు. విజిలెన్స్, ఫుడ్ క్వాలిటీ విభాగాల నుంచి కూడా అధికారులు వచ్చి వీటిని తనిఖీ చేస్తున్నారు. ఏ స్థాయి వ్యక్తులు ఇందులో ఇన్వాల్వ్ అయి ఉన్నారన్నది ఇప్పుడు ప్రశ్న. దేవాలయాలకు పూర్వ వైభవం తెచ్చేటట్లుగా, ప్రసాదాలు నాణ్యంగా ఉండేటట్లుగా ఈ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వ్యవస్థలను చక్కదిద్దడానికి చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ప్రయత్నిస్తోంది" అని గంటా అన్నారు. అన్న ప్రసాదం స్వీకరించిన భక్తులతోనూ గంటా శ్రీనివాసరావు సంభాషించి నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

## గండ్ల పూడికతీత పనులు నాణ్యంగా చేపట్టాలి :మంత్రి నిమ్మల

**ఏపీలో అకాల వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న కాలువలు, డ్రైనేజీలు, చెరువులకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: ఏపీలో అకాల వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న కాలువలు, డ్రైనేజీలు, చెరువులకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇరిగేషన్ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావులతో కలిసి తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు రాష్ట్రంలోని జలవనరుల శాఖ సీఈ, ఎస్ఈ, ఈఈలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద నష్టం, గండ్లు పూడిక పనులపై జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈ, ఈఈలతో అత్యవసర సమావేశంలో చర్చించారు. గట్లకు ఎక్కడెక్కడ గండ్లు పడ్డాయో గుర్తించి వాటిని వెంటనే పూడ్చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించిన గండ్లకు కలెక్టర్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆఖరి ఎకరం వరకూ రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందిరాకుండా చూడాలన్నారు. గోదావరి డెల్టా సిస్టమ్లో ప్రధానంగా ఏలేరు, అమ్మిలేరు, ఎర్ర కాలువ, బుడమేరు, కొల్లేరుకు సంబంధించి గండ్లతోపాటు ఆక్రమణలనూ గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కృష్ణా డెల్టా సిస్టమ్లో ఏలూరు, బందరు, బుడమేరుతోపాటు గూడూరు ఛానెల్ గండ్లతో పోల్చడంతోపాటు బకింగ్ హాం కెనాల్ శివారు ప్రాంతం వరకు నీరు అందాలని సూచించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ, ఎడమ కాలువ కింద ఉన్న కాలువలు, చెరువుల గండ్లను పూడ్చాలన్నారు. గండ్ల పూడికతీతకు సంబంధించి చేపట్టిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## శ్రీవారి లడ్డూ కల్తీపై పీఠాధిపతుల ఆగ్రహం

**తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపవిత్ర పదార్థాలు వాడారని తెలిసి ఎంతో వేదన చెందినట్లు చెప్పారు.**




పెద్దపులిపాక, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపవిత్ర పదార్థాలు వాడారని తెలిసి ఎంతో వేదన చెందినట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పెద్దపులిపాకలో హిందూ దేవాలయాల పరిరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు మాట్లాడారు. "ప్రసాదంలో ఏం కలుస్తుందోనన్న భయంతో భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అపవిత్ర పదార్థాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలి. స్వామి సన్నిధిలో వేరే మతస్థులకు ఉద్యోగం ఉండకూడదు. శ్రీవారిపై భక్తి విశ్వాసాలు ఉన్నవారికే ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రభుత్వం, ప్రజలు కలిసి ధర్మాన్ని రక్షించాలి. ల్యాబ్ నివేదికలు మనకు ఆధారం.. అవి స్పష్టం చేసినప్పుడు చర్యలు తీసుకోవాల్సిందే. ఇంకా తప్పు జరగలేదంటే అపహాస్యమే అవుతుంది. ల్యాబ్లు ఇచ్చిన నివేదిక ప్రకారం కోర్టుకు వెళ్లాల్సిందే. కోర్టు విధించిన శిక్షలు అమలు చేస్తేనే ఇలాంటివి మరోసారి జరగకుండా ఉంటుంది" అని స్పష్టం చేశారు.

## గత ప్రభుత్వ పాపాలు నేటికి ప్రజలను పట్టి పీడిస్తున్నాయి :మంత్రి గొట్టిపాటి

**గత ప్రభుత్వం చేసిన పాపాలు నేటికీ ప్రజలను పట్టి పీడిస్తున్నాయని విద్యుత్శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: గత ప్రభుత్వం చేసిన పాపాలు నేటికీ ప్రజలను పట్టి పీడిస్తున్నాయని విద్యుత్శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. నీళ్లు, పాలు, నెయ్యి, మద్యం ఇలా ఏదీ కల్తీకి కాదు అనర్హం అన్నట్టుగా వైకాపా పాలన సాగిందని విమర్శించారు. గత ప్రభుత్వమంతా కల్తీయేనని ఆరోపించారు. దోచుకున్న అంశం డైవర్ట్ చేయడానికే డైవర్షన్ పాలిటిక్స్ అంటూ ప్రచారం మొదలు పెట్టారని రవికుమార్ దుయ్యబట్టారు. రివర్స్ టెండరింగ్ అంటూ పోలవరాన్ని దెబ్బతీశారని, పీపీఏలను రద్దు చేసి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేశారని ఆక్షేపించారు. చివరికి దేవుడి ప్రసాదానికి వాడే నెయ్యిని రివర్స్ టెండరింగ్ అంటూ కల్తీ చేయించారని మండిపడ్డారు. నిన్న మీడియా సమావేశంలో 70 నిమిషాలకు పైగా మాట్లాడిన జగన్.. ఎన్డీడీబీ నివేదికపై ఎందుకు సమాధానం చెప్పలేకపోయారని నిలదీశారు. తప్పులు కప్పిపుచ్చుకునేందుకే ఎదురుదాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన తప్పుల నుంచి మాటల ఎదురుదాడితో ఏ ఒక్కరూ తప్పించుకోలేరని హెచ్చరించారు.

## పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదు: తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ

**హైదరాబాద్లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు.**




హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: నగరంలోని తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రముఖ కవి, పరిశోధకుడు, ఉద్యమకారుడు సురవరం ప్రతాప్రెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ స్పందించింది. ఈ విషయంపై సీఎం రేవంత్రెడ్డి పునరాలోచన చేయాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ కోరారు. పొట్టి శ్రీరాములు ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదని, దేశం గర్వించదగ్గ నాయకుడని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని మహాత్మాగాంధీ ప్రశంసలందుకున్నారని, ఆ మహనీయుడి జ్ఞాపకార్థం తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్రెడ్డి పేరు పెట్టాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కానీ, ఆయన్ని గౌరవించే క్రమంలో పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదన్నారు. ఏదైనా కొత్త ప్రాజెక్టుకు సురవరం పేరు పెట్టి.. ఆయన్ని గౌరవించాలని కోరారు.

## వృద్ధ దంపతుల దాతృత్వం.. గ్రామాభివృద్ధికి విరాళంగా రూ.కోటి చేసే స్థలం

**చనిపోయిన తమ కుమారుడి ఆఖరి కోరిక తీర్చలేదని, అందుకు బదులుగా రూ.కోటి విలువ చేసే స్థలాన్ని గ్రామాభివృద్ధికి విరాళంగా ఇచ్చింది ఓ వృద్ధ జంట.**



చొప్పదండి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: చనిపోయిన తమ కుమారుడి ఆఖరి కోరిక తీర్చలేదని, అందుకు బదులుగా రూ.కోటి విలువ చేసే స్థలాన్ని గ్రామాభివృద్ధికి విరాళంగా ఇచ్చింది ఓ వృద్ధ జంట. దాతృత్వాన్ని చాటుకున్న వారిని అందరూ అభినందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోలిరామయ్యపల్లికి చెందిన నునుకొండ లస్మయ్య. రామమ్మ అనే వృద్ధ దంపతులకు ముగ్గురు సంతానం. వారి మూడో కుమారుడైన నునుగొండ ప్రభాకర్ 2004లో రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. అంతకుముందు చికిత్స పొందుతున్న ప్రభాకర్ మరణానంతరం తన నేత్రాలను దానం చేయాలని తల్లిదండ్రులను కోరాడు. అయితే ఆ సమయంలో నేత్రదానం సాధ్యం పడలేదు. ఇటీవల ఆ వృద్ధ దంపతులు తమ ఆస్తిని ముగ్గురు కుమారులకు సమానంగా వాటాలు వేశారు. ఈ క్రమంలోనే ప్రభాకర్ వాటాకు వచ్చిన సుమారు రూ.కోటి విలువ చేసే ఎకరం ఆరు గుంటల స్థలాన్ని గ్రామాభివృద్ధికి విరాళంగా ఇచ్చేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆ స్థలానికి చెందిన దస్త్రాలను మాజీ సర్పంచి అంజన్ ప్రసాద్కు ఇచ్చి అందజేశారు. ఈ స్థలాన్ని ప్రజావసరాలకు వినియోగించేందుకు వృద్ధ దంపతులతోపాటు తమ ఇద్దరు కుమారులు సత్యనారాయణ, మల్లయ్యలు అంగీకరించారు.

# బాల కార్మికులు, బాల్యవివాహాలపై జిల్లా కలెక్టర్ అత్యవసర సమావేశం

- నడి సెంటర్లలో బిక్షం ఎత్తుకుంటున్న బాల్యం
- కథనానికి జిల్లా కలెక్టర్ స్పందన
- తనిఖీలతో బెంబేలెత్తుతున్న దుకాణం యజమానులు
- జిల్లా కలెక్టర్ నేడు అత్యవసర సమావేశం

నంద్యాల అర్బన్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 21: ప్రజా రిపబ్లిక్ పత్రిక నందు నడి సెంటర్లలో బాల్యం కథనం పై స్పందించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాల కార్మికుల నివారణ కార్యాలయం అధికారులు శ్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు పోలీసులు కలిసి పట్టణంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో చిన్నారులతో బిక్షమెత్తిస్తున్న ఆయా సంరక్షకులను హెచ్చరిక ఇచ్చి వారి అడ్రస్సులు ఫోన్ నెంబర్లు తీసుకొని పంపించారు. మరొకసారి ఇలాంటి సంఘటనలకు పాల్పడితే ఆయా సంరక్షకులపై కేసు నమోదు చేస్తామని పోలీసులు వారిపై కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించి చిన్నారులను సంరక్షక కేంద్రాలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తరలిస్తున్నామని అధికారులు తెలిపారు. బాల కార్మికుల దుకాణాల యాజమానులకు జరిమానాలు విధించారు. శనివారం సాయంత్రం బాల కార్మిక నివారణ, బిక్షం ఎత్తుకుంటున్న బాలలు, బాల్య వివాహాలపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.


బిక్షాటానా చేస్తున్న పిల్లలను విచారిస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు



గాంధీజీ వేశధారణలో ఉన్న బాలుడుని శరీరం పై ఉన్న కెమికల్ శుభ్రం చేస్తున్న అధికారులు


బాల కార్మికులు పని చేస్తున్న దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1981: అంతర్జాతీయ శాంతి దినోత్సవం
- 1862: "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న మహావ-ుణీషి గురజాడ అప్పారావు జననం (మ. 1915).
- 1939: భారతీయ తత్వవేత్త, విద్యావేత్త, రాజకీయవేత్త అగ్నివేష్ జననం (మ. 2020).
- 1898: తెలుగు రంగస్థల, సినిమా నటుడు, సంగీత విశారదుడు అద్దంకి శ్రీరామమూర్తి జననం (మ. 1968).
- 1931: తెలుగు, తమిళ, కన్నడ సినిమా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు జననం.
- 1944: సాహితీవేత్త, సినిమా నిర్మాత ఎమ్వీయల్. నరసింహారావు జననం (మ. 1986).
- 1980: భారతీయ చలన చిత్ర నటీమణి కరీనా కపూర్ జననం.
- 2011: విద్యా, సాహితీ, సామాజిక వేత్త తుమ్మల వేణుగోపాలరావు మరణం (జ. 1928).
- 2012: నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ మరణం (జ. 1915).


శాంతి దినోత్సవం


గురజాడ అప్పారావు


అగ్నివేష్


శ్రీరామమూర్తి


సింగీతం శ్రీనివాసరావు


నరసింహారావు


కరీనా కపూర్


వేణుగోపాలరావు


లక్ష్మణ్ బాపూజీ

## రిపబ్లిక్ సినిమా CINEMA

# ఆ హీరో ఇల్లు వేలం.. బాలీవుడ్ నవ్వుకుంది: రజనీకాంత్ కీలక వ్యాఖ్యలు

**అగ్ర నటుడు, తన మిత్రుడు అమితాబ్ బచ్చన్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు నటుడు రజనీకాంత్**

రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలిసి నటిస్తోన్న చిత్రం 'వేట్టయాన్'. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం చెన్నైలో జరిగింది. ఇందులో పాల్గొన్న రజనీకాంత్.. అగ్ర నటుడు, తన మిత్రుడు అమితాబ్ బచ్చన్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఆర్థిక సమస్యలు చవి చూశారని తెలిపారు. గాంధీ కుటుంబంతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నప్పటికీ ఆయన ఎవరి సాయం తీసుకోలేదని.. తనంతట తానే అన్నింటినీ ఎదుర్కొని మళ్లీ ధైర్యంగా నిలబడ్డారని పేర్కొన్నారు. "అమితాబ్ బచ్చన్ సినీ నిర్మాతగా ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నారు. భారీ నష్టాలు చవిచూశారు. వాచ్మెనకూ జీతం చెల్లించలేని స్థితికి చేరారు. జూహూ ఇంటిని వేలానికి పెట్టారు. ఆ సమయంలో బాలీవుడ్ మొత్తం ఆయన్ని చూసి నవ్వింది. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఆయన ఎప్పుడూ కుంగిపోలేదు. మళ్లీ తిరిగి నిలబడటం కోసం తీవ్రంగా శ్రమించారు. మూడేళ్ల పాటు ప్రతి యాడ్, కౌన్ బనేగా కరోడ్పతి.. ఇలా వచ్చిన అన్ని అవకాశాలు సద్వినియోగం చేసుకున్నారు. తాను పోగొట్టుకున్న వాటిని తిరిగి పొందారు. జూహూలోని ఇంటితోపాటు అదే వీధిలో మరో మూడు గృహాలు కొనుగోలు చేశారు. 82 ఏళ్ల వయస-ులోనూ రోజూ 10 గంటలు పనిచేస్తూనే ఉంటారాయన. ఈ విధంగా ఆయన ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. "అమితాబ్ బచ్చన్కు గతంలో ఒక ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇందిరా గాంధీ ఒక సమావేశం కోసం విదేశాలకు వెళ్లారు. అమితాబ్కు జరిగిన ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆమె ఇండియా తిరిగి వచ్చేశారు. అప్పుడే అందరికీ తెలిసింది రాజీవ్ గాంధీ, అమితాబ్ కలిసి చదువుకున్నారని. గాంధీ కుటుంబంతో బచ్చన్కు సత్సంబందాలు ఉన్నాయని. అమితాబ్ బచ్చన్ తండ్రి హరివంశరాయ్ బచ్చన్ గొప్ప రచయిత. తండ్రి పేరు ప్రఖ్యాతలతో అమితాబ్ కావాలంటే ఎవరి సాయం అయినా అడగవచ్చు. కానీ, సమస్యలు వచ్చినప్పుడు.. ఆయన ఎవరి సాయం తీసుకోలేదు. తనంతట తానే అన్నింటినీ ఎదుర్కొన్నారు" అని రజనీకాంత్ చెప్పారు.



## వెంకీ-అనిల్ మూవీ సెట్స్‌లో సందడి చేసిన బాలయ్య



టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్, సక్సెస్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా షూటింగ్ జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను 'వెంకీ-అనిల్ 3' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు మేకర్స్. ఇప్పటికే ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర సెట్స్‌లో మరో స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ సందడి చేశాడు. గతంలో అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో నందమూరి బాలకృష్ణ 'భగవంత్ కేసరి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రంలో నటించాడు. దీంతో ఇప్పుడు ఈ డైరెక్టర్ వెంకటేష్‌తో తెరకెక్కిస్తున్న సినిమా సెట్స్‌లో ఆయన కాసేపు సందడి చేశాడు. సినిమా షూటింగ్ వివరాలు చిత్ర యూనిట్‌ను అడిగి తెలుసుకున్నాడు. ఇక వెంకటేష్‌తో పాటు అనిల్ రావిపూడితో బాలయ్య చేసిన సందడికి సంబంధించిన ఓ వీడియో మేకర్స్ నెట్టింట రిలీజ్ చేశారు. కాగా, ఈ సినిమాను పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా చిత్ర యూనిట్ రూపొందిస్తోంది. ఇందులో వెంకటేష్ ఓ ఎక్స్ కాప్‌గా కనిపిస్తాడు.

## రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# పంత్ - గిల్ జోరు.. టీమ్ ఇండియా లీడ్ 432 రన్స్

**బంగ్లాదేశ్ పై పూర్తి పట్టు సాధించే దిశగా భారత్ వెళ్తాంది. ఇప్పటికే 432 పరుగుల ఆధిక్యం సాధించింది. ఐదు వందలు దాటాక ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేస్తుందేమో చూడాలి.**

చెపాక్ వేదికగా సాగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశకు భారత్ భారీ లక్ష్యం నిర్దేశించేందుకు సిద్ధమైంది. ఓవర నైట్ 81/3 స్కోరుతో మూడో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా లంచ్ బ్రేక్ సమయానికి మూడు వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. క్రీజ్లో శుభ్మన్ గిల్ (86లి), రిషబ్ పంత్ (82) ఉన్నారు. వీరిద్దరూ నాలుగో వికెట్కు శతక (138) భాగస్వామ్యం నిర్మించారు. దీంతో భారత్ ఆధిక్యం 432 పరుగులకు చేరింది. భారత్ తొలి ఇన్నింగ్స్ లో 376 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ 149 పరుగులకే ఆలౌటైంది.



### ఆరంభంలో నిదానం.. తర్వాత దూకుడే

మూడో రోజు ఆట ప్రారంభంలో పిచ్ పేస్కు అనుకూలంగా ఉండటంతో భారత బ్యాటర్లు రిషభ్ పంత్ - గిల్ ఆచితూచి ఆడారు. సింగిల్స్‌తో స్ట్రైక్స్‌ను రొటేట్ చేస్తూ వచ్చారు. క్రీజ్లో కుదరుకున్నాక.. ఒక్కసారిగా జోరు పెంచారు. మరీ ముఖ్యంగా మెహిదీ హసన్ను లక్ష్యంగా చేసుకుని భారీషాట్లు కొట్టారు. ఈ క్రమంలో ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఇక అక్కడి నుంచి వీరి ఆటతీరు మారిపోయింది. లంచ్ బ్రేక్ కు ముందు చివరి 10 ఓవర్లలో దాదాపు ఆరు రన్రేట్తో పరుగులు రాబట్టారు. దీంతో భారత్ స్కోరు రెండో ఇన్నింగ్స్‌లోనూ 200ం దాటేసింది. ఈ సెషన్లో భారత్ 28 ఓవర్లలో 124 పరుగులు చేసింది. తొలి సెషన్ మరికాసేపట్లో ముగుస్తుందనగా.. షకిబ్ బౌలింగ్లో లో రిషబ్ పంత్ ఇచ్చిన క్యాచ్ను బంగ్లా కెప్టెన్ షాంటో వదిలేశాడు. దీంతో ఈ సెషన్ను ఒక్క వికెట్ నష్టపోకుండా భారత్ ముగించింది. బ్యాటర్లు ఇద్దరూ సెంచరీలు సాధించే దిశగా వెళ్తున్నారు. లంచ్ బ్రేక్ నుంచి వచ్చాక.. టీమ్ ఇండియా ఇన్నింగ్స్ను డిక్లేర్ చేసే అవకాశం లేకపోలేదు.

## ఇంటి చిట్కాలు

# బాడీలో యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గాలంటే వీటిని తినండి

**శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే సమస్యలొస్తాయి. ఈ సమస్యని తగ్గించేందుకు కొన్ని ఫుడ్స్‌ని మన డైట్‌లో యాడ్ చేయాలి. వీటి కారణంగా యూరిక్ యాసిడ్ లెవల్స్ బ్యాలెన్స్ అవుతాయి. అవేంటో తెలుసుకోండి. యూరిక్ యాసిడ్ బాడీలో ఎక్కువగా ఉంటే సమస్య పెరుగుతుంది. దీని కారణంగా బాడీ పెయిన్స్, మజిల్స్ పెయిన్స్, కిడ్నీ సమస్యలొస్తాయి. వీటిని తగ్గించుకోవాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన ఆహారం, హెల్దీ లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వాలి. అదే విధంగా, కొన్ని ఫుడ్స్‌ని యాడ్ చేయాలి. ఆ ఫుడ్స్ ఏంటో తెలుసుకోండి.**



### చెర్రీస్..

చెర్రీస్‌లలో ఎక్కువగా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. అవన్నీ కూడా బాడీలో యూరిక్ యాసిడ్ లెవల్స్‌ని తగ్గిస్తాయి. అందుకే, చెర్రీలను ఎక్కువగా తినడం అలవాటు చేసుకోండి. వీటి వల్ల సమస్య తగ్గుతుంది.



### అరటిపండ్లు..

ప్యూరిన్ తక్కువగా ఉన్న అరటిపండ్లు తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ లెవల్స్‌ని బ్రేక్ చేసే కాంపౌండ్‌ని కలిగి ఉంటుంది. కాబట్టి, వీటిని మీరు హ్యాపీగా తినొచ్చు.



### విటమిన్ సి, సిట్రస్ ఫ్రూట్స్..


విటమిన్ సి ఎక్కువగా తీసుకుంటే యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గుతాయి. అదే విధంగా, గౌట్ సమస్య కూడా తగ్గుతుంది. దీంతో పాటు సిట్రస్ ఫ్రూట్స్ కూడా బాడీలోని యూరిక్ యాసిడ్‌ని గ్రహించి బయటికి పంపించడంలో హెల్ప్ చేస్తాయి. కాబట్టి, వీటిని కూడా మీ డైట్‌లో యాడ్ చేసుకోండి. నిమ్మరసంలో, నిమ్మలో కొద్ది పాటి ప్యూరిన్ ఉన్నప్పటికీ బాడీలో యూరిక్ యాసిడ్ లెవల్స్‌ని నార్మల్ చేయడానికి హెల్ప్ చేస్తాయి.

### ఆపిల్స్..

ఆపిల్స్‌లో ఎక్కువగా డైటరీ ఫైబర్, మాలిక్ యాసిడ్స్ ఉంటాయి. వీటిని మన రోజువారీ డైట్‌లో యాడ్ చేసుకుంటే బాడీలో యూరిక్ యాసిడ్ లెవల్స్ పెరగకుండా ఉంటాయి. అందుకే, వీటిని కచ్చితంగా మన డైట్‌లో యాడ్ చేసుకోవాలి.



### గ్రీన్ టీ..



గ్రీన్ టీ.. చాలా హెల్దీ టీ.. ఈ టీలో ఎక్కువగా కాటెచిన్స్ ఉంటాయి. ఇవి పవర్ ఫుల్ యాంటీ ఆక్సిడెంట్స్. ఇవి.. యూరిక్ యాసిడ్ ప్రొడక్షన్‌ని పెంచే పెంచే ఎంజైమ్స్‌ని తగ్గిస్తాయి. అందుకే గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవాలి.

### నీరు..

నీటిని ఎక్కువగా తాగడం అలవాటు చేసుకోవాలి. నీటిని తాగడం వల్ల బాడీలోని యూరిక్ యాసిడ్ కంటెంట్ యూరిన్ ద్వారా వెళ్తుంది. కాబట్టి, కచ్చితంగా నీటిని అలవాటు చేసుకోండి.



### ఇవి వద్దు..

అదే విధంగా, మీరు ఏయే ఫుడ్స్ తింటే మంచిదో తెలుసుకున్నారు. ఇప్పుడు అవాయిడ్ చేయాల్సిన ఫుడ్స్ గురించి తెలుసుకోండి. ప్యూరిన్ ఎక్కువగా ఉండే డ్రింక్స్, ఫుడ్స్‌ని అవాయిడ్ చేయాలి. ఆల్కహాల్, పంచదార, రెడ్ మీట్, ఆర్గాన్ మీట్స్‌ని తగ్గించాలి. వీటితో పాటు ఫిష్, షెల్ ఫిష్, పౌల్ట్రీ వంటి వాటిని కూడా తగ్గించాలి.

